ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

మాట్లాడుతున్న కేశవ్‌దాదా ఇంగ్లె

రెబ్బెన, మార్చి 4: ధ్యాన మార్గం ద్వారా సన్మార్గం వైపు నడుస్తూ ప్రతి ఒక్కరూ తమ జీవితాలను ఆనందమయం చేసుకోవాలని సిద్ధేశ్వర సంస్థాన్ ట్రస్ట్ అధ్యక్షుడు కేశవ్‌దాదా ఇంగ్లె సూచించారు. రెబ్బెన మండలం మదావాయిగూడలోని శ్రీ సంత్ పరమ హంస సద్గురు పూలాజీ బాబా ధ్యాన కేంద్రం 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల విద్యుత్‌శాఖ ఎస్ఈ శేషారావు, ఉపాధ్యాయుడు భగవంత్‌రావు, మాజీ సర్పంచు పార్వతి, గ్రామ పెద్దలు వడై సోంజీ, కోలే తిరుపతి, చటారే పోశెట్టి, కాశయ్య, ధ్యాన కేంద్రం అధ్యక్షుడు భిమాన్కర్ కుమార్, గ్రామ పటేల్ మల్లయ్య, సంతోశ్, రవి, సుధాకర్ పాల్గొన్నారు.

'ప్రజావాణి' సమస్యల పరిష్కారానికి కృషి

- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 4: ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తాను పదో తరగతి వరకు చదువుకున్నానని, పేద కుటుంబానికి చెందిన తనకు ఉపాధి కల్పించాలని కోరుతూ రెబ్బెన మండలం కొండపల్లికి చెందిన అదే భారతి దరఖాస్తు అందజేశారు. తమ వ్యవసాయ భూముల్లో గిరి వికాస్ పథకంలో భాగంగా బోరు బావి మంజూరై, బోరు వేశామని, విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరుతూ వాంకిడి మండలం, మార్కగూడకు చెందిన కోవా బాపురావు, నవేదరి గ్రామానికి చెందిన కొర్కెట సతలబాయి వేర్వేరుగా అర్జీలు సమర్పించారు. తాను కులాంతర వివాహం చేసుకున్నానని, ఇద్దరు పిల్లలతో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని కోరుతూ ఆసిఫాబాద్ పట్టణంలోని ఆర్.ఆర్.కాలనీకి చెందిన పెందోర్ భువనేశ్వరి దరఖాస్తు అందజేశారు. తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ కాగజ్‌నగర్ పట్టణంలోని బసంతినగర్‌కు చెందిన మిత్ర సుబోధ్ దరఖాస్తు అందజేశారు. తన భర్త తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడిగా పనిచేస్తూ అనారోగ్యంతో మరణించాడని, తన కూతురు చదువు, పోషణ కొరకు ఉపాధి కల్పించాలని కోరుతూ పెంచికల్ పేట మండలం అగర్‌గూడ గ్రామానికి చెందిన గోలేటి శారద అర్జీ సమర్పించారు. తన తాతకు చెందిన భూములు ఇతరుల పేరిట రికార్డు మార్పిడి జరిగాయని, ఈ తప్పిదాన్ని సవరించి వారసులమైన తమ పేరిట నమోదు చేయాలని కోరుతూ దహేగాం మండలం బీబ్రా గ్రామానికి చెందిన సుంకరి భీమయ్య దరఖాస్తు అందజేశారు. గ్రామ శివారులో ఉన్న తన ఇల్లు భూ సేకరణలో పోతుందని, రీ సర్వే చేయించి పునరావాసం, రీ సెటిల్‌మెంట్, జీవనోపాధి కల్పించాలని కోరుతూ రెబ్బెన మండలం గోలేటి గ్రామానికి చెందిన గొర్లపల్లి మాధవి దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు

ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించాలి

- ఎస్పీ కే సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 4: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి బాధితులకు అండగా ఉంటూ, ఫిర్యాదులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ కే సురేశ్‌కుమార్ అర్జీదారులకు భరోసా ఇచ్చారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు ఇచ్చిన పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ప్రజావాణిలో బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంతో పాటు బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. బాధితులకు కచ్చితంగా న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. అలాగే చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తూ, శాంతిభద్రతల పరిస్థితులకు భంగం కలిగించేవారిపై, మహిళలకు వ్యతిరేకంగా జరిగే నేరాలపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్

సమావేశంలో మాట్లాడుతున్న మున్నూర్‌కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్

ఆసిఫాబాద్, మార్చి 4: మున్నూరు కాపు సంఘం ఫైనాన్స్ కార్పొరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య పటేల్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని కులాల కంటే మున్నూరు కాపులే అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. అన్ని రంగాల్లో చాలా వెనుకబడి ఉన్నారని, వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్లతో ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో మున్నూరు కాపు సంఘం భవనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. సంఘం బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. సమావేశంలో యువత సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, నాయకులు మిట్ట వెంకన్న, గడ్డల సురేశ్, అడప సతీశ్, మనిగొండ వెంకన్న, కుందరపు శంకరమ్మ, గణపతి, సదాశివ్, జక్కయ్య, తిరుపతి, గుర్రాల వెంకన్న, గోపాల్ తదితరులు ఉన్నారు.

6న వాహనాల వేలం పాట

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 4: ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో అక్రమంగా మద్యం సరఫరా చేస్తూ పట్టుబడిన వాహనాలను ఎక్సైజ్ జిల్లా అధికారి జ్యోతి కిరణ్ సమక్షంలో వేలం వేయనున్నట్లు ఎక్సైజ్ పట్టణ సీఐ దీపక్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహిస్తారన్నారు. ఆసక్తి గలవారు పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎక్సైజ్ సీఐ ఫోన్ నంబర్ 8712658783లో సంప్రదించాలని సూచించారు.

గంగాపూర్ గేట్ మూసివేత

రెబ్బెన, మార్చి 4: రెబ్బెన మండల కేంద్రంలోని గంగాపూర్ రైల్వే గేట్ లైన్ మరమ్మతుల కారణంగా, ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజుల పాటు మూసి ఉంటుందని రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే గేట్ అవతల ఉన్న గ్రామాల ప్రజలు గమనించి, ఇతర దారుల గుండా ప్రయాణం చేసి, అధికారులకు సహకరించాలని కోరారు.

8,9 తేదీల్లో మహాశివరాత్రి ఉత్సవాలు

బెజ్జూర్, మార్చి 4: మండల కేంద్రంలో ఈ నెల 8, 9వ తేదీల్లో మహాశిరాత్రి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు రంగనాయక ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగెడిపల్లి మహేశ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఏటా మాఘమాసంలో శివుడికి అత్యంత పర్వదినమైన శివరాత్రిని అంగరంగ వైభవంగా జరుపుతుండగా ఈ ఏడాది కూడా జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు అఖండ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించి, పుణ్యాహవచనం, గణపతిపూజ, అమ్మవారి పూజ, తదితర అభిషేక పూజలు చేస్తామని పేర్కొన్నారు. మరుసటి రోజు శనివారం శివ పార్వతుల కల్యాణ వైభోగాన్ని అంగరంగ వైభవంగా జరిపిస్తామని తెలిపారు. అదే విధంగా సంస్కృతిక కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఉత్సవాల ఏర్పాట్లు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

తునికాకు యూనిట్ల అమ్మకాలు చేపట్టాలి

మంచిర్యాలటౌన్, మార్చి 4 : తునికాకు యూనిట్ల అమ్మకాలను ప్రభుత్వం త్వరగా చేపట్టాలని బీడీ లీవ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పుస్కూరు వరప్రసాదరావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. తమ అసోసియేషన్ తరపున వినతి పత్రాన్ని అందజేశారు. రాష్ట్రంలో 194 తునికాకు యూనిట్లు ఉండగా, 26 యూనిట్ల ఆకు మాత్రమే అమ్మకాలు చేశారన్నారు. మార్చి 15 తర్వాత యూనిట్ల అమ్మకాలు జరుగవు కాబట్టి ఈ లోపే చేపట్టాలని కోరారు. దీని వల్ల ప్రభుత్వంపై ఎలాంటి భారమూ పడదని, మొత్తం సొమ్ము తునికాకు కాంట్రాక్టర్ దగ్గరనే వసూలు చేసి కార్మికులకు ఇవ్వడం జరుగుతుందన్నారు.

కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి యువరాజ్

ఆసిఫాబాద్, మార్చి 4: జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె. యువరాజ్ పేర్కొన్నారు. ఈనెల 16న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంపై సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయస్థాన భవన సముదాయంలో జిల్లా జూనియర్ న్యాయమూర్తి అనంతలక్ష్మితో కలిసి పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశంలో యువరాజు మాట్లాడారు. జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. కేసులను రాజీకి వచ్చేలా చేయడం ద్వారా కక్షిదారులు సమయం, డబ్బు ఆదా చేసుకోవచ్చని వివరించారు. సంబంధిత స్టేషన్ల వారీగా కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సైబర్ క్రైం కేసులను అధిక సంఖ్యలో రాజీ చేయడంతో పాటు అందించిన వారి సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కేసుల పరిష్కారంలో రాజీమార్గమే రాజ మార్గమన్నారు. సమావేశంలో ఆసిఫాబాద్ డీఎస్‌పీ సదయ్య, జైనూర్, సీఐలు అంజయ్య, శ్రీనివాస్, చిట్టిబాబు, అగ్నిమాపక శాఖ అధికారి కె. రవీందర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి యువరాజ్

సమావేశంలో మాట్లాడుతున్న సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లం

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిర్పూర్(టీ), మార్చి 4: సిర్పూర్(టీ) జూనియర్ సివిల్ కోర్టులో మార్చి 16న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సిర్పూర్(టి) జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ అజయ్ ఉల్లం కోరారు. సోమవారం మండలకేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో సిర్పూర్(టీ) కోర్టు పరిధిలోని పోలీస్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులు, భూమి కేసులు, కుటుంబ తగాదాలు, బ్యాంక్, ఇతర కేసులను రాజీ మార్గంలో లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సమావేవంలో ఏపీపీ ఎలిషా, కౌటల సీఐ సాదిక్ పాషా, కాగజ్‌నగర్ సీఐ నాగరాజు, సిర్పూర్(టీ) కోర్టు పరిధిలోని పలు మండలాల ఎస్ఐలు పాల్గొన్నారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఇందిరనగర్ కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

రెబ్బెన, మార్చి 4: రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయంలో సోమవారం ఆసిఫాబాద్ వనిత శక్తి ఆధ్వర్యంలో 'మన అమ్మకు మన సారే' కార్యక్రమం నిర్వహించారు. అనంతరం మహిళలు మంగళహారతులతో అమ్మవారిని దర్శించుకొని లలితాసాహస్ర నామాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. నైవేద్యం, ఒడిబియ్యం, పట్టు వస్త్రాలు, పూలు, పండ్లు అమ్మవారి సన్నిధిలో ఉంచి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల అనంతరం వన భోజనాలు చేశారు. ఆలయ అర్చకుడు దేవర వినోద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

ఎమ్మార్సీ కార్యాలయంలో చోరీ

- రెండు కంప్యూటర్లు అపహరణ
- పోలీస్‌స్టేషన్‌కు వంద అడుగుల దూరంలో ఘటన

దహెగాం, మార్చి 4: మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రంలో(ఎమ్మార్సీ) చోరీ జరిగింది. రెండు కంప్యూటర్లు అపహరణకు గురయ్యాయి. కార్యాలయ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం సిబ్బంది విధులు ముగించుకొని కార్యాలయానికి తాళం వేసి వెళ్లారు. తిరిగి సోమవారం ఉదయం అటెండర్ పందిర్ల రమేశ్ వచ్చి చూడగా, తలుపులు పగులగొట్టి ఉన్నాయి. వెంటనే అతడు ఎంఐఎస్ రాజేశ్‌కు సమాచారం ఇచ్చాడు. విషయాన్ని ఎంఈవో భిక్షపతి, ఎస్ఐ సనత్‌కుమార్‌కు తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ రూప్‌సింగ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

కంప్యూటర్లు చోరీకి గురైన ఎమ్మార్సీ కార్యాలయము

ఇటీవలే కొత్తగా తీసుకొచ్చిన రెండు కంప్యూటర్లు, సీపీయూలు, ఇతర పరికరాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. చోరీకి గురైన కంప్యూటర్ల విలువ రూ.1.20 లక్షలు ఉంటుంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ఎమ్మార్సీ కార్యాలయం పోలీస్‌స్టేషన్‌కు అతి సమీపంలో ఉండడం చర్చనీయాంశమైంది.

సస్య రక్షణ చర్యలు పాటించాలి

రెబ్బెన, మార్చి 4: వరి పంటకు అనుగుణంగా సస్య రక్షణ చర్యలు పాటించాలని రెబ్బెన వ్యవసాయ అధికారిని మంజుల స్పష్టం చేశారు. మండలంలోని నక్కలగూడ గ్రామ పరిధిలో సోమవారం పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నక్కలగూడ గ్రామ పరిధిలో దాదాపు 400 ఎకరాల్లో వరి వేశారన్నారు. నాటు వేసిన 60 రోజుల్లోపు పొట్ట దశకు చేరుకోవడంపై వ్యవసాయ, విత్తన కంపెనీల అధికారులు పంటను పరిశీలించి రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారన్నారు. పంటకు అనుగుణంగా సస్య రక్షణ చర్యలు తీసుకుంటూ, రసాయన ఎరువులు తగు మోతాదులో వాడాలని, ఎక్కువగా వాడవద్దని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వరి పైరులో తల్లి మొక్కల్లో ఒకే ఒక్క పిలక అక్కడక్కడా ముందస్తుగా పొట్టకు వచ్చే అవకాశం ఉందన్నారు. రబీ సీజన్‌లో అన్ని రకాల వరి పైరుల్లో ఇబ్బంది ఉందన్నారు. దీని గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఈవో రాకేశ్, కంపెనీ ప్రతినిధులు, ఫర్టిలైజర్ షాప్ యజమానులు, రైతులు పాల్గొన్నారు.

నక్కలగూడలో వరి పైరు పరిశీలిస్తున్న ఏవో మంజుల

మహా శివరాత్రి జాతర ఏర్పాట్ల పరిశీలన

జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్ఐ మధూకర్

కౌటాల, మార్చి 4: మండలంలోని శివ సిద్ధ హనుమాన్ మందిర్ తాటిపల్లి కుర్త వద్ద ఈనెల 6 నుంచి నిర్వహించనున్న మహాశివరాత్రి జాతరలో భాగంగా కమిటీ నిర్వహిస్తున్న ఏర్పాట్లను సోమవారం ఎస్ఐ మధూకర్ పరిశీలించారు. 'జాతరలో ఎంతమంది వస్తారు..? రవాణా, తాగునీటి సౌకర్యం, వాహనాల పార్కింగ్ తదితర ఏర్పాట్లు చేస్తున్నారా.? పేకాట, మద్యం దుకాణాలు లేకుండా, భక్తులకు అన్ని సౌకార్యలు కల్పించేలా చూడాలి' అని కమిటీ సభ్యులకు ఎస్ఐ సూచించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలను ఎస్ఐ పరిశీలించారు.

పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వినతి

సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న భారత జాగృతి నాయకులు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 4: తెలంగాణ అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ భారత జాగృతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుకు వినతిప్రతం అందజేశారు. సోమవారం భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు ఎమ్మెల్యే హరీశ్‌బాబును ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఆవరణలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహ ఏర్పాటుకు కృషి చేయాలని పేర్కొన్నారు. అంతకుముందు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో భారత జాగృతి కుమ్రం భీం జిల్లా అధ్యక్షుడు పర్శ చంద్రశేఖర్, సిర్పూర్ నియోజకవర్గ కన్వీనర్ డోకె దామోదర్, మహిళా జిల్లా కన్వీనర్ మాచర్ల వినోద, మండల కన్వీనర్ ఎస్ శ్రీనివాస్, జాగృతి సభ్యురాలు మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ఈస్‌గాంలో పోలీసుల కవాతు

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 4: శాంతిభద్రతల పరిరక్షణ కోసమే పోలీసుల కవాతు నిర్వహిస్తున్నామని కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని ఈస్‌గాంలో కేంద్ర భద్రత బలగాలతో (ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్) కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. ప్రజలంతా శాంతియుతంగా, సామరస్యంగా ఉండేందుకు కవాతు నిర్వహించామన్నారు. త్వరలో ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ఎలాంటి వర్గ, విభేదాలు, అల్లర్లు లేకుండా ఉండేందుకు ఆయా చోట్ల అవగాహన సదస్సులు, కవాతు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన అట్టి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈస్‌గాం ఎస్ఐ రామన్‌కుమార్, కేంద్ర పోలీసు బలగాల అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఈస్‌గాంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

గోలేటిలో షాట్‌పుట్ వేసి క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న సేవా సమితి ఉపాధ్యక్షురాలు నళినీనరేందర్

రెబ్బెన, మార్చి 4: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, పురుషులకు దీటుగా రాణించాలని బెల్లంపల్లి ఏరియా సింగరేణి సేవా సమితి ఉపాధ్యక్షురాలు నళినీనరేందర్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్ బంగ్లాస్ ఏరియాలో లేడీస్ క్లబ్ మహిళలకు సోమవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా షాట్‌పుట్, బాల్ ఇన్ ది బాస్కెట్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నళినీనరేందర్ క్రీడలు ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపొందిన వారికి మహిళా దినోత్సవం ప్రధాన వేడుకల్లో బహుమతులు అందజేస్తామన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

కెరమెరి, మార్చి 4: కుటుంబ కలహాలతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొలాం కొటారిలో జరిగింది. ఎస్ఐ విజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మడావి ఆనంద్‌రావ్(28)కు భార్య జ్యోతితో ఈనెల 1న వాగ్వాదం జరిగింది. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. తీవ్ర మనస్తాపానికి గురైన ఆనంద్‌రావు సోమవారం మద్యం తాగిన మైకంలో గ్రామ సమీపంలోని చింత చెట్టుకు ఉరేసుకున్నాడు. ఆనందరావ్ సోదరుడు మడావి రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజా పాలన సేవాకేంద్రాలు ప్రారంభం

కెరమెరి, మార్చి 4: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఎంపీపీ పెందోర్ మోతీరాం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గృహజ్యోతి పథకంలో భాగంగా పేరు నమోదు, రూ.500కే గ్యాస్ సిలిండర్ కోసం ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవాకేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నెలకు 200 యూనిట్‌లోపు విద్యుత్‌ను వాడుతున్న వినియోగదారులు కరెంట్ మీటర్ నంబర్, వంట గ్యాస్ నంబర్ తప్పుగా నమోదైతే సరిచేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల మధ్య సంబంధింత కంప్యూటర్ ఆపరేటర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సుధాకర్, సీనియర్ అసిస్టెంట్ రామకృష్ణ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

తిర్యాణి: దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎంపీడీవో వేముల మల్లేశ్

దహెగాం, మార్చి 4: మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించినట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. ఇక నుంచి ప్రజాపాలనకు సంబంధించిన ఎలాంటి దరఖాస్తులైన ఈ కేంద్రంలో అందజేయవచ్చని సూచించారు. జూనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారిని ప్రజాపాలన సేవాకేంద్రానికి కేటాయించామన్నారు. ప్రజాపాలన సేవాకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూడీసీ నగేశ్, తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణి,మార్చి 4: ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో మల్లేశ్ కోరారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రజాపాలనలో భాగంగా గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ తదితర పథకాల్లో దరఖాస్తు చేసుకుని లబ్ధి చేకూరని వారి కోసం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. దరఖాస్తుల్లో దొర్లిన తప్పులను సవరించి తిరిగి లబ్ధి చేకూరేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదేశానుసారం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వివిధ పథకాలకు సంబంధించి మూడు దరఖాస్తులు సైతం స్వీకరిస్తామన్నారు. ఆధార్, రేషన్ కార్డు, దరఖాస్తు పెట్టుకున్న రసీదుతో ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో సుధాకర్‌రెడ్డి, జేఆర్ గోదావరి ఉన్నారు.

దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలి

కాగజ్‌నగర్ టౌన్, మార్చి 4: కాగజ్‌నగర్ డివిజన్‌లోని దివ్యాంగులందరికీ అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఆర్డీవో కార్యాలయం ఎదుట జాతీయ వేదిక నాయకులు ధర్నా చేశారు. అనంతరం డీఏవో ప్రమోద్‌కుమార్‌కు దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు వినతిప్రతం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న రేషన్ కార్డుల్లో దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. మొదటి ప్రాధాన్యతగా తమను గుర్తించాలని వినతిపత్రంలో కోరినట్లు వారు తెలిపారు. ధర్నాలో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్, ముంజం ఆనంద్ కుమార్, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శులు జాకీర్, సప్తగిరి, వెంకటేశ్, లక్ష్మి, ప్రమిల, అశోక్, యాదగిరి, రవీందర్, ఈశ్వరి పాల్గొన్నారు.

డీఏవోకు వినతిప్రతం అందజేస్తున్న దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు